నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 23 డిసెంబర్ 2023 | NALGONDA

# నేడు ముక్కోటి ఏకాదశి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన వైష్ణవాలయాలు
ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు
ప్రత్యేక అలంకరణలో యాదగిరి గుట్ట ఆలయం
ఆలయ వేళల్లో మార్పులు.. పలు ఆర్జిత సేవలు తాత్కాలికంగా నిలిపివేత



సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి చేసిన ఏర్పాట్లు

వైకుంఠ ఏకాదశి రోజున మహా విష్ణువు గరుడ వాహన రూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి దర్శనమిస్తాడని భక్తుల నమ్మకం. శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాలను ముస్తాబు చేశారు. ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యాదగిరి గుట్ట ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత రెండోసారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి అన్ని సౌకర్యాలు కల్పించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ వేళల్లో స్వల్ప మార్పు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు కనగల్ 'ఆదర్శ' విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మమత

నల్లగొండ సిటీ, డిసెంబర్ 22 : ఈ నెల 24 నుంచి 27 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కనగల్ మండలం అక్కినేపల్లి వెంకటేశ్వరావు మెమోరియల్ మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మమత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీలకు స్పందన, షాలిని, బేస్‌బాల్ పోటీలకు బి.సౌమ్య, జి.హర్ష, సుష్మిత, మానస, బాలుర విభాగంలో ప్రవీష్, శివాజీ, సందీప్, మణికంఠ ఎంపికయ్యారు. అలాగే హైదరాబాద్‌లో జరిగే ఖోఖో పోటీలకు పావని, శివ, చెస్ పోటీలకు అనూరాధ, సుషిలత ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# యాసంగి సాగుకు భగీరథ ప్రయత్నం

## సాగు నీటికి విరివిగా బోర్లు వేస్తున్న రైతులు


- బావుల్లో పూడిక తీత
- నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో రైతుల ప్రత్యేక చొరవ
- సాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేకపోవడమే కారణం
- మంచి ధరతో వానకాలం మాదిరిగా యాసంగిలో వరి సాగుకు మొగ్గు

*ఈ ఏడాది సరిపడా వర్షాలు లేకపోవడం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో యాసంగిలో ఆయకట్టుకు నీరందించే పరిస్థితి లేదు. వానకాలంలో వరికి మంచి ధర రావడంతో యాసంగిలో వరి సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. కాల్వ నీళ్లు లేకున్నా బోర్లు, బావుల ద్వారా సాగు చేసేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం కొత్తగా బోర్లు వేస్తున్నారు. బావుల్లో పూడిక తీస్తున్నారు. పాలకవీడు, నేరేడుచర్ల మండలాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న బోర్ మిషన్‌లే నిదర్శనం. భూగర్భ జలాలు అడుగంటినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా నీళ్లు పడేదాకా బోర్లు వేస్తున్నారు. రానున్న పంటల దిగుబడే తమను కాపాడుతుందని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.*

– పాలకవీడు, డిసెంబర్22



నేరేడుచర్లలో బావిలో పూడిక తీత



పాలకవీడులో బోరు వేయిస్తున్న రైతులు

### ఈ సారే ఇలా..

కేసీఆర్ హయాంలో వరుసగా 18 సార్లు సాగర్ ఆయకట్టుకు నీరు వదలడంతో రైతులు ఏ ఇబ్బంది లేకుండా వ్యవసాయం పండుగలా చేసుకొన్నారు. గత వానకాలం ప్రారంభంలో నీటి విడుదల జరుగకున్నా నాటి నమ్మకంతో రైతులు వరిసాగు చేపట్టారు. తీరా ఎండిపోయే పరిస్థితి వచ్చేనాటికి ప్రభుత్వం నీటిని విడుదల చేయడంతో వేలాది ఎకరాల్లో పంట చేతికి వచ్చింది. దీనికి తోడు ధాన్యానికి వానకాలంలో సన్న రకానికి చెందిన వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,600 నుంచి రూ.3,200 ధర పలికింది. ఈ నేపథ్యంలో ఈ యాసంగి సాగు చేసేందుకు తమకున్న పంట పొలాల్లో నీటి లభ్యతను పెంచుకోవడం కోసం రైతులు విరివిగా బోర్లు వేయించుకొంటున్నారు. దీంతో పలు గ్రామాల్లో బోరు బండ్లు విరివిగా కన్పిస్తున్నాయి.

### భారీగా తగ్గనున్న వరి సాగు

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గత వానకాలంలో 4.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది యాసంగి సాగుకు నీటి విడుదల చేయడానికి అవకాశాలు లేకపోవడంతో భారీగా వరి సాగు విస్తీర్ణం తగ్గనుంది. జిల్లాలో వానకాలంతో పోలిస్తే లక్ష ఎకరాల్లో వరిసాగు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానకాలంలో పాలకవీడు మండలంలో 17,251 ఎకరాల్లో వరిసాగు కాగా యాసంగిలో 11 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు.

### బావుల్లో పూడిక తీత, కొత్తగా బోర్లు

ఈ యాసంగికి కాల్వ ద్వారా సాగర్ నీటి విడుదల లేకపోవడంతో రైతులు ఉమ్మడి నేరేడుచర్ల మండలంలో సాగునీటికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. పంట సాగు కోసం కాలానికి ఎదురీదుతూ ఎడాపెడా బోర్లు వేస్తున్నారు. పాత బావుల్లో సైతం ఖర్చుకు వెనుకాడకుండా పూడికలు తీయిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ ఎస్కవేటర్లు, ఆధునిక యంత్రాలను సైతం రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. బావుల పూడిక తీతకు గంటకు రూ.4,000 నుంచి 4,500 వరకు వసూలు చేస్తున్నారు. చిన్న బావులైతే 2 నుంచి 4గంటల సమయం, పెద్ద బావులైతే 4 నుంచి 8 గంటల సమయం పడుతున్నది. ఒక్కో రైతు సుమారు రూ.15 వేల నుంచి రూ.50 వేలు ఖర్చు చేస్తున్నారు.

### అశాస్త్రీయ పద్ధతులే దిక్కు

తమ పొలాల్లో నీటి లభ్యత పెంచడం కోసం రైతులు విరివిగా బోర్లు వేస్తున్నారు. బోర్లు వేయడానికి ముందు నీటి లభ్యతకు అనువైన ప్రదేశం ఎంచుకోవాలి. కానీ జియాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో రైతులు అశాస్త్రీయ పద్ధతులను నమ్ముకుంటున్నారు. కొబ్బరికాయలు చేతిలో పెట్టుకొని బోర్ పాయింట్‌లు చూపించుకుంటున్నారు. ఒక్కో బోర్ పాయింట్ చూసినందుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు చెల్లిస్తున్నారు. రైతులు బోర్లు అధికంగా వేస్తుండడంతో బోర్ మిషన్ యజమానులు రేట్లు పెంచుతున్నారు. డ్రిల్లింగ్ అడుగుకు రూ.90 నుంచి రూ.100, కేసింగ్‌కు రూ.350 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్క బోర్ వేసేందుకు రైతులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు అవుతున్నది. వీటికి తోడు విద్యుత్ మోటర్, పైప్‌లైన్ కోసం మరో రూ.50 వేల నుంచి రూ.70 వరకు అవుతున్నది.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు

గతంలో ఉమ్మడి నరేడుచర్ల మండలంలో బోర్లు 40 నుంచి 50 అడుగుల లోపు బోర్లు పడేవి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ నేపథ్యంలో బోర్లు 60 నుంచి 300 అడుగుల వరకు వేస్తున్నారు. 600 అడుగుల వరకు బోర్లు వేసే సామర్థ్యం గల యంత్రాలు ఉండడంతో నీళ్ల కోసం ఎంతో లోతుకైనా వేయడానికి రైతులు వెనుకాడడం లేదు.

### వరికి మంచి ధర ఉండడంతోనే బోర్లు వేస్తున్నాం..



వానకాలంలో పండిన వరికి మంచి ధర పలుకడంతో యాసంగిలో ఎంత ఖర్చయినా సరే పంట సాగు చేయాలనుకున్నారు. దాంతో కొత్తగా బోర్లు వేస్తున్నాం ఈ ఏడాది నాకున్న పొలంలో రెండు కొత్త బోర్లు వేయించిన, లక్ష రూపాయల వరకు ఖర్చు అయినాయి. అయినా పంట పండిస్తే మంచి ధర వస్తుందని నమ్మకం ఉంది.

–యరెడ్ల సత్యనారాయణరెడ్డి, రైతు

### బోర్లు వేయించుకునే రైతుల సంఖ్య పెరిగింది



గతంలో కొద్దిమంది పెద్ద రైతులు మాత్రమే బోర్లు వేయించుకునే వారు. ఈ యాసంగి సాగులో చిన్న రైతులు కూడా ఎక్కువగా బోర్లు వేయించుకుంటున్నారు. గతంలో ఈ సీజన్‌లో ఒక్కో మండలంలో 20 నుంచి 30 బోర్లు వేసే వాళ్లం. ఇప్పుడు 60 నుంచి 100 బోర్లు వేస్తున్నాం. బోర్లు వేయించుకునే వారి సంఖ్య పెరుగడంతో తీరిక లేకుండా పనిచేస్తున్నాం.

– వెంకన్న, బోర్‌వెల్ యజమాని

# ఆర్టీసీ కార్గోలో హమాలీల ఆక్రందన..!

## హమాలీ చార్జీ పార్సిల్‌కు రూ.10నుంచి రూ.5 తగ్గించిన ఆర్టీసీ

- వినియోగదారుడి నుంచి మాత్రం పార్సిల్ రేటు పెంపు
- కూలి గిట్టడం లేదని వాపోతున్న హమాలీలు
- నిత్యావసర ధరల పెంపునకు అనుగుణంగా పెంచాలని వేడుకోలు




నల్లగొండ సిటీ, డిసెంబర్ 22 : నష్టాలో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు కేసీఆర్ సర్కార్ ఆర్టీసీలో కార్గో సేవలను ప్రవేశపెట్టింది. దాంతో బస్సుల్లో వచ్చే సామగ్రిని దించి ఎత్తేందుకు హమాలీలు పని చేసేవారు. గతంలో వారికి పార్సిల్‌ను బట్టి రూ.10 రూపాయలు ఇచ్చేవారు. తాజాగా పార్సిల్ చార్జీలను పెంచిన ఆర్టీసీ యజమాన్యం హమాలీ చార్జీలను మాత్రం తగ్గించింది. దాంతో హమాలీలకు కూలి గిట్టక పూట గడవడం కష్టంగా మారింది. గత 30 సంవత్సరాలకు పైగానే నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌లో పార్సిళ్ల ఎగుమతి, దిగుమతి చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో ఏఎన్ఎల్ పేరున ఉన్న పార్సిల్ సెంటర్స్ ప్రస్తుతం కార్గో పేరున సరుకుల రవాణా జరిగే సందర్భంలో ఎగుమతి, దిగుమతి చేస్తున్న హమాలీలకు సరైన చార్జీలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అనుసరించి హమాలీల రేట్లు పెంచాల్సిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం తగ్గించడంతో రోజువారీ కూలి గిట్టడం లేదని వాపోతున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పార్సిల్ చార్జీలు పెంచాలని కోరుతున్నారు.

### పార్సిల్ రేట్లు పెంపు..

ఆర్టీసీ సంస్థ శుక్రవారం నుంచి సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేసి పార్సిల్స్ రేట్లను పెంచింది. కానీ, హమాలీ రేటు మాత్రం గతంలో రూ.10 రూపాయలు ఉండగా దానిని 5 రూపాయలకు తగ్గించి హమాలీల పొట్ట కొట్టింది. దాంతో రోజువారీ కూలి గిట్టడం లేదని కార్మికులు వాపోతున్నారు. తాజాగా పార్సిల్ రేట్లు పెంచిన ఆర్టీసీ ఇప్పటి వరకు కవర్ చార్జి రూ.55 ఉండగా దాన్ని రూ.60కి, 25 కేజీల బరువు గల లగేజీ చార్జీని రూ.85 నుంచి 90 రూపాలయకు పెంచింది.

### రేట్లు తగ్గించి మా పొట్ట కొట్టారు



గతంలో ఒక పార్సిల్‌పై కనీసం 10 రూపాయలు ఉండేది. ఆ పైన బరువును బట్టి చార్జీలు పెరుగుతుండేవి. ఇప్పుడు ఉన్న దానిని 5 రూపాయలకు తగ్గించి ఆర్టీసీ యాజమాన్యం మా పొట్ట కొట్టింది. ఇది ఏమాత్రం సరైనది కాదు. ఆర్టీసీ సంస్థ పునరాలోచన చేసి పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలి.

–అంజి, హమాలీ, నల్లగొండ

### రోజుకు రూ.100 కూడా రావు



నేను 30 సంవత్సరాలుగా ఆర్టీసీలో హమాలీ పని చేస్తున్నా. ఏఎన్ఎం ఉన్నప్పుడు కూడా కనీస చార్జి రూ.10 రూపాయలు చెల్లించేది. దాని స్థానంలో గత నాలుగు సంవత్సరాల క్రితం కార్గోను తీసుకొచ్చారు. అయినా కనీస చార్జి 10 రూపాయలు, ఆ పైన బరువును బట్టి చార్జీలు చెల్లించేవారు. తాజాగా కార్గో పార్సిల్ రేట్లను పెంచిన అధికారులు హమాలీ చార్జీలు మాత్రం తగ్గించారు. దాంతో మాకు రోజుకు వంద రూపాయలు కూడా గిట్టడం లేదు.

–నర్సింహ, హమాలీ, నల్లగొండ

# ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
- వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, డిసెంబర్ 22 : ప్రత్యేక ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2024 జనవరి 1నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. 2024 జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. ముసాయిదాపై జనవరి 22 వరకు అభ్యంతరాలు అందజేయవచ్చన్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వేర్వేరు చోట్ల రెండు ఓట్లు కలిగిన వారి ఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని రాజారామ్ కళాశాలలోని పోలింగ్ కేంద్రం-109 ఓటర్లకు అనుకూలంగా లేదని, దానిని సాహితి స్కూల్‌కు మార్చాలని రాజకీయా పార్టీల ప్రతినిధులు కోరగా ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పెన్‌పహాడ్ మండలం చీదెళ్లలో కొంత మంది ఓటర్లు ఓటరు జాబితాలో నమోదు కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా విచారణ చేయాలని సూర్యాపేట ఆర్డీఓను ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, అబిద్, రవి, స్టాలిన్, కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# 'పార్లమెంట్'కు సన్నద్ధం

## లోక్‌సభ ఎన్నికలకు ముమ్మర కసరత్తు



- అటు అధికారులు.. ఇటు పార్టీల ప్రణాళిక
- ఇటీవల ఓటరు నమోదు ప్రక్రియ షురూ
- వచ్చే వారం నుంచి వివిధ ఎన్నికల కమిటీల నియామకం
- గెలుపు కోసం రాజకీయ పార్టీల ఫోకస్
- బరిలో నిలిచేందుకు పలువురు నేతల ఆసక్తి
- అధిష్టానం మెప్పు కోసం ప్రయత్నాలు

**రానున్న పార్లమెంట్ ఎన్నికలకు అంతా సన్నద్ధమవుతున్నారు. అటు అధికార యంత్రాంగం.. ఇటు రాజకీయ పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఎవరి పనుల్లో వారు బిజీ అవుతున్నారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. వచ్చే వారం తర్వాత వివిధ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత అధికారులు ఎన్నికల పనుల్లోనే తలమునకలు కానున్నారు. మరోవైపు బరిలో నిలిచేందుకు పలువురు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. అటు అధిష్టానం మెప్పు, ఇటు ప్రజల్లో ప్రాచుర్యం పొందడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.**

*– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)*

దేశ వ్యాప్తంగా వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. మన దగ్గర భువనగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ఉంది. దీని పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. భువనగిరి, ఆలేరు, జనగాం, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీలు ఉన్నాయి. భువనగిరి కేంద్రంగా ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ, కార్యకలాపాలు ఉండనున్నాయి. ఇక ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేలా సిద్ధం అవుతున్నారు. ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లనున్నారు. వచ్చే వారంలో ఎన్నికల సంఘం నుంచి వివిధ అంశాలపై ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వచ్చే వారం ఎన్నికలకు సంబంధించి పలు కమిటీలను నియమించనున్నారు. దాంతో ఆయా కమిటీలకు వివిధ పనుల్లో నిమగ్నం కానున్నాయి. ప్రతి రోజు సమావేశాలు, సమీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా అధికారులతో రివ్యూలు చేపడుతూ సలహాలు, సూచనలు చేయనున్నారు.

### ఓటరు నమోదు షురూ..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కొత్త ఓటర్ల నమోదుతోపాటు మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. తుది జాబితా కూడా విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరోసారి కొత్త ఓటర్ల ప్రక్రియకు మరో ఛాన్స్ ఇచ్చింది. ఈ మేరకు ఇటీవల షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఈ నెల 20 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. జనవరి 5వ వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ, మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. జనవరి 6న ఓటరు ముసాయిదా జాబితా, 8న తుది జాబితాను ప్రకటించనున్నారు.

### మెప్పు కోసం నేతల ప్రయత్నాలు..

ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు నానాతంటాలు పడుతున్నారు. అటు పార్టీల అధిష్టానం మెప్పు పొందేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. తాము టికెట్ రేస్‌లో ఉన్నామని, తమకే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. స్థానికంగా నేతలతో సైతం తమకే టికెట్ వస్తుందని పలువురు నేతలు బహిరంగంగా చెప్పడం గమనార్హం. మరోవైపు జనంలోకి వెళ్లేందుకు సదరు నేతలు పాట్లు పడుతున్నారు. ప్రజలకు దగ్గరయ్యేందుకు తమవంతు కార్యక్రమాలు చేపడుతున్నారు.

### రాజకీయ పార్టీల ఫోకస్..

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. ఎలాగైనా ఎంపీ సీటును కైవసం చేసుకోవాలని కార్యాచరణ రూపొందిస్తున్నాయి. అధిష్టానాలు ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులపై ఆరా తీస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఏకంగా భువనగిరి ఇన్‌చార్జ్‌గా ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని నియమించింది. బీఆర్ఎస్ పార్టీ భువనగిరిపై స్పెషల్ ఫోకస్ పెట్టి, పలువురు నేతలతో సమాలోచనలు చేసినట్లుగా తెలిసింది. బీజేపీ వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నది.



పామాయిల్ తోటలో అంతర పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శ్రీధర్

# సమీకృత వ్యవసాయానికి పామాయిల్ తోటలు ఉపయోగకరం

**జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీధర్**

పెన్‌పహాడ్, డిసెంబర్ 22 : సమీకృత వ్యవసాయానికి పామాయిల్ తోటలు ఎంతో ఉపయోగకరమని జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాచారంలో సాగు చేసిన పామాయిల్ తోటలను సందర్శించి మాట్లాడారు. పామాయిల్ తోటలు ఏపుగా, ఆరోగ్యంగా పెరిగేందుకు శాస్త్రవేత్తల సలహాలతోపాటు ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా యాసంగిలో అనువైన అంతర పంటలుగా పుచ్చ, దోస, పచ్చిమిర్చి, వేరుశనగ సాగు చేయవచ్చని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు పామాయిల్ తోటలు సాగు చేసి ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యానశాఖ అధికారి జగన్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, తూముల ఇంద్రసేనారావు, ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.